ఈనాడు
పెద్దపల్లి
శనివారం అక్టోబరు 5, 2024

ప్రసవాలకు శస్త్రచికిత్సలను ప్రోత్సహించొద్దు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితిలో తప్ప ప్రసవాలకు శస్త్రచికిత్సలను ప్రోత్సహించవద్దని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం ఆయన సమీకృత పాలనా ప్రాంగణంలో ప్రైవేటు ఆసుపత్రుల స్త్రీ వైద్య నిపుణులతో సమావేశమయ్యారు. పలు ఆసుపత్రుల్లో వంద శాతం ప్రసవాలు శస్త్రచికిత్సలతోనే జరుతున్నాయన్నారు. వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలు పాటించి సాధారణ కాన్పులను ప్రోత్సహించాలని సూచించారు. కాన్పులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పుల వివరాలను తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ డిజిటల్ సర్వే తీరును కలెక్టర్ శ్రీహర్షకు వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్

పొరపాట్లు లేకుండా కుటుంబ డిజిటల్ సర్వే

పెద్దపల్లి: కుటుంబ డిజిటల్ సర్వే ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. పెద్దపల్లి పురపాలిక పరిధిలోని 24వ వార్డులో చేపట్టిన సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కుటుంబ సభ్యులకు సంబంధించిన నిర్దేశిత సమాచారాన్ని పూర్తి స్థాయిలో సేకరించాలన్నారు. ఈ నెల 8లోగా పైలట్ ప్రాజెక్టు సర్వే పనులను పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేనెందుకు చెరువుకు చేరలేదు..

చేప పిల్ల అంతర్మథనం

అనగనగా.. నేను ఒక చేపపిల్లను.. ఎందుకో ఈసారి నాతోపాటు చాలా చిరు చేపలు చెరువులకు చేరలేదు. వర్షాలు బాగానే కురిశాయి. వాగులు వంకలు పొంగిపొర్లాయి. చెరువులు నిండాయి. కానీ మా పెంపకానికి సరిపడే విధంగా మమ్మల్ని ఉమ్మడి జిల్లాకు తీసుకు రాలేదు. పాపం.. నాలుగు జిల్లాల్లో 53,859 మంది మత్స్యకారులు గంపెడాశలతో మా కోసం ఎదురు చూస్తున్నారు. మేము సకాలంలో జలాశయాల్లోకి చేరి పెరిగి పెద్దయితే.. వారికి ఎనలేని సంబురం. 772 మత్స్య సహకార సంఘాలకు మా పెంపకం జీవనాధారం. ఆగస్టు నెల ఆరంభంలోనే ఎల్లంపల్లి, ఎగువ, మధ్య, దిగువ మానేరు జలాశయాల్లో మమ్మల్ని వదలాలి. 3,235 చెరువుల్లోకి చేర్చాలి. కానీ మా పంపిణీకి అవసరమైన టెండర్లకు గుత్తేదారులు అనాసక్తి చూపడంతో ఈ ఆలస్యం జరిగిందట. నిజానికి ఈ వానాకాలం ముందరే అంటే ఏప్రిల్, మే నెలల్లోనే ఈ ప్రక్రియ చేపట్టాలి. అప్పట్లో ఎన్నికల కోడ్ వల్ల ఇబ్బంది ఎదురైంది. తరువాత మా సరఫరాపై సకాలంలో దృష్టి పెట్టకపోవడం, గుత్తేదారుకు కమీషన్ తక్కువ ఉంటుండటంతో ఇబ్బంది జరిగింది. ఉత్పత్తి కేంద్రాల్లోనూ అనుకున్న లక్ష్యానికి తగినట్లు మా సంతతి లేకపోవడంతో పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఇంకా జాప్యం జరుగుతోంది.

ఊపిరి అందే వీలుంది. మత్స్యకారులు ఇదే ఆశతో మా రాక కోసం నిరీక్షిస్తున్నారు. అసలే ఆలస్యమైందని.. అందులోనూ అరకొరగానే పంపిణీ చేసిన తీరుపై సంఘాల సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

కరీంనగర్‌కే పరిమితం..

బొమ్మెలు, బొచ్చెలు, జెల్లలు, రాహు, బంగారు తీగ, ముల్లంగి తదితర రకాల్లోని మా ఉనికికి ఉమ్మడి జిల్లా జలాశయాలు అనువైన ప్రాంతం. కానీ దురదృష్టవశాత్తు ఈ సారి కరీంనగర్ దిగువ మానేరు జలాశయంలోనే ఈ నెల 3న 15 లక్షల మా తోటి చేపపిల్లల్ని ప్రజాప్రతినిధులు, అధికారులు వదిలారు. ఈ ఒక్క చోటే 30 లక్షలను పెంచాలని లక్ష్యం. కానీ సగంతోనే సరిపెట్టారు. ఈ జలాశయంపై ఆధారపడిన 2 వేల కుటుంబాలవారు ఇవి ఏ మేర సరిపోతాయనే ఆందోళనలో ఉన్నారు. ఈపాటికే మమ్మల్ని వదిలి ఉంటే.. ఈ ఒక్కచోటే 1,920 టన్నుల బరువు రూపంలో దిగుబడి.. రూ.11.50 కోట్ల ఆదాయం సమకూరేది. ఈ ఆలస్యం వల్ల మా ఎదుగుదలలో కచ్చితంగా లోపమేర్పడి జాలరులకు ఆర్థికంగా నష్టం వాటిల్లే అవకాశముంది. గతేడాదిలో నాలుగు జిల్లాల్లోని చెరువులు, కుంటలు, జలాశయాల్లో మొత్తంగా 6.08 కోట్ల మేర మమ్మల్ని వదిలారు. ఈసారి కూడా దాదాపుగా 7 కోట్ల వరకు మమ్మల్ని జలవనరుల్లో వదలాలని భావించినా.. అనుకున్న పురోగతి లేదు. మరో వారంలో మూడు జిల్లాల్లో పంపిణీ చేస్తామనే మాటలు ఆచరణకు నోచుకుంటేనే మా ఉనికికి

చెప్పలేనన్ని ఇక్కట్లు..

- మా మీదే ఆధారపడిన మత్స్యకారులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. జాలరుల దోసిళ్లలో పిల్లలుగా మేమున్నప్పుడు వాళ్ల కళ్లలో చూసిన సంతోషం.. మేము పెద్దయ్యాక వలలో చిక్కుకున్నప్పుడు కనబడటం లేదు.
- మత్స్యశాఖ అధికారులు ముందు నుంచి అంచనాలు వేసి పంపిస్తున్న స్థాయిలో నీళ్లలోకి మేము చేరడం లేదు. కాగితాల్లో పక్కాగా మా సంఖ్య ఉంటున్నా.. జలంలోకి వదిలే సమయంలో తక్కువ పంపిణీతో అక్రమాలు జరుగుతున్నాయి.
- నీళ్లలో మమ్మల్ని జార విడిచేటప్పుడు 35 నుంచి 40 మి.మీ.ల పరిమాణంలో ఉంటాం. మమ్మల్ని పట్టుకునే సమయానికి కిలో నుంచి కిలోన్నర బరువు మేము తూగాలి. కానీ విపరీతమైన ఎండలు, కలుషిత నీటి వల్ల మా జాతిలో చాలా ముందే మరణిస్తున్నాయి.
- సంఘాల సభ్యులకు మార్కెటింగ్ సహా ఇతర సౌకర్యాల పరంగా ఇబ్బందులను అధికారులు తీర్చాలి. ఏడాదికి 6 కోట్లకుపైగా పంపిణీ చేస్తే మేము పెరిగి పెద్దై 6వేల టన్నుల దిగుబడిగా మారాలి. కానీ 3-4 వేల టన్నుల దిగుబడే వస్తుండటం బాధాకరం.
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా దృష్టి పెట్టి మా సంతతి కోసం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో ఉన్న ఉత్పత్తి కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలి. మా మీదే ఆధారపడిన మత్స్యకారుల ఆర్థిక ప్రగతికి తోడ్పడే చర్యల్ని తీసుకోవాలి.

– ఈనాడు, కరీంనగర్

కార్మికులపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

మరో మూడు నెలల్లో రామగుండం నగరపాలకవర్గ గడువు ముగియనున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి కార్మికులపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. రానున్న ఎన్నికల్లో మరో మారు పోటీకి సిద్ధమవుతున్న కార్పొరేటర్లు, ఆశావహులు ప్రజల్లో ప్రతిష్ఠ పెంచుకునేందుకు సత్వరమే ఆయా సమస్యలను పరిష్కరించాలంటూ కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇలా రెండు వైపులా ఒత్తిళ్లతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా నగరంలో వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉంది. త్వరలోనే గుత్తేదారు గడువు ముగియనుండడంతో వీధి దీపాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. దీంతో నగరపాలిక డివిజన్లలోని పలు కాలనీల్లో అంధకారం నెలకొంది. కాలనీల్లోనైతే సమస్య యథాతథంగా ఉంది. ఈ నేపథ్యంలో కాలనీల్లో కొత్త లైట్లు, దీపాలకు మరమ్మతులు చేయాలని కార్మికులకు కార్పొరేటర్ల నుంచి ఎక్కువగా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఏ మాత్రం జాప్యం చేసినా సదరు కార్మికుడు సరిగా పని చేయడం లేదని, పట్టించుకోవడం లేదంటూ ప్రచారం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఔత్సాహికులు సైతం ఇదే తరహాలో కార్మికులను వేధిస్తున్నారు. తాము ఫలానా ప్రజాప్రతినిధికి అనుయాయులమంటూ బెదిరించిన సంఘటనలున్నాయి. ఈ కారణంగానే కమిషనర్ సెలవుపై వెళ్లి బదిలీకి ప్రయత్నిస్తున్నట్లు నగరంలో చర్చించుకుంటున్నారు.

ఎవరికి చెప్పుకోవాలో తెలియక..

మరో మూడు నెలల్లో కార్పొరేటర్ల పదవీ కాలం ముగుస్తుందని కొందరు సహనం వహిస్తుండగా మరికొందరు తీవ్ర వేదనకు గురవుతున్నారు. వేధింపులు భరించలేక ఓ కార్మికుడు శుక్రవారం నగరపాలక భవనంపైకి ఎక్కి ఆందోళనకు దిగడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. తాను ఓ ప్రజాప్రతినిధి శిష్యుడినని, రానున్న ఎన్నికల్లో కార్పొరేటర్‌గా పోటీ చేస్తానని.. తాను చెప్పిన పనులు ఎందుకు చేయడం లేదంటూ ఓ కార్మికుడిపై తీవ్ర పదజాలంతో దూషించిన సంఘటన కార్మికుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ విషయంలో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక నగరపాలక కార్మికులు తల పట్టుకుంటున్నారు. సమన్వయంతో వ్యవహరిస్తేనే అభివృద్ధిలో వేగవంతం, సమస్యలు పరిష్కారమౌతాయి తప్ప కార్మికులపై ఒత్తిడి తేవడం వల్ల ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.

భవనంపైకి ఎక్కి ఆందోళన

గోదావరిఖని పట్టణం : రామగుండం నగరపాలక ఒప్పంద విద్యుత్తు కార్మికుడు కనకయ్య శుక్రవారం కార్యాలయం భవనం ఎక్కి ఆందోళన చేపట్టారు. నగరంలోని ఓ డివిజన్ కార్పొరేటర్, అతని తమ్ముడు సామాజిక మాధ్యమాల్లో తనపై తప్పుడు పోస్టులు పెట్టడంతో తీవ్రవేదనకు గురయ్యానని, తలెత్తుకోలేకపోతున్నాని వాపోయాడు. వీధి దీపాలకు మరమ్మతులు చేయడం లేదని తనను గత మూడు రోజులుగా వేధిస్తున్నారన్నారు. తోటి కార్మికులు సముదాయించడంతో కనకయ్య ఆందోళన విరమించి భవనంపై నుంచి కిందికి దిగాడు.

80 మంది డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. పెద్దపల్లి ఎంఈవో కార్యాలయంలో ప్రత్యేక బృందాలు అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నారు. శుక్రవారం 80 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇప్పటి వరకు మొత్తం 180 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. కాగా స్పెషల్ ఎడ్యుకేషన్(ప్రత్యేక అవసరాల పిల్లలు) కేటగిరీలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 17 ఉండగా అభ్యర్థుల జాబితా పంపించలేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో కొన్ని జిల్లాలకే ఈ పోస్టుల మంజూరు చేశారు. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ శ్రీహర్ష పరిశీలించారు.

జెన్‌కో ఆధ్వర్యంలోనే విద్యుత్తు కేంద్రం చేపట్టాలి

పాలకుర్తి(రామగుండం), న్యూస్‌టుడే: రామగుండంలో 800 మెగా వాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కో భాగస్వామ్యంతోనే చేపట్టాలని కోరుతూ టీపీఈజేఏసీ(తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేశారు. రామగుండం బీ స్టేషన్ 62.5 మె.వా ప్లాంట్ ప్రధాన గేటు ముందు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యుత్తు అధికారులు, ఇంజినీర్లు, కార్మిక సంఘాల నాయకులు నిరసనలో పాల్గొని మాట్లాడారు. సింగరేణి భాగస్వామ్యం లేకుండా పూర్తి స్థాయిలో జెన్కో ఆధ్వర్యంలో విద్యుత్త కేంద్రం నిర్మించాలన్నారు. డీఈలు శంకరయ్య, బాలకృష్ణ, ఈఈ సూర్యనారాయణరెడ్డి, సత్యశ్రీనివాస్, డీఈలు కృష్ణమూర్తి, అనిల్ కుమార్, రాజశేఖర్, కిషోర్, శివ కుమార్, కార్మికులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న విద్యుత్తు ఇంజినీర్లు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు

ఆసుపత్రిలో తాగునీటి తంటాలు

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో సిబ్బందితో పాటు రోగులు గత కొంతకాలంగా తాగునీటికి తంటాలు పడుతున్నారు. ఆసుపత్రి ఆవరణలో క్రిటికల్ కేర్ భవన నిర్మాణం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకుండానే ఉపరితల జలాశయం కూల్చేయడంతో పాటు సంపును తొలగించారు. దీంతో ఇటీవల బోరు మోటారు చెడిపోవడంతో రెండు రోజుల పాటు నీటి కోసం ఆసుపత్రి వర్గాలతో పాటు రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. నీటి కొరత తీర్చడం కోసం ఆసుపత్రి ప్రధాన గేటు ముందు విశాలమైన సంపు నిర్మాణ పనులను అర్ధాంతరంగా ఆపేశారు. నిర్వహణ సరిగ్గా లేక మురుగు నీరంతా అసంపూర్తి సంపులో నిండి దుర్గంధం వస్తుంది. వెంటనే సంపు పూర్తి చేయాలని ఇటీవల ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్, ఆసుపత్రి వర్గాలు టీఎంఎస్ఐడీసీ అధికారులను కోరినప్పటికీ పనులు పునఃప్రారంభం కాలేదు. సంపు నిర్మాణాన్ని పూర్తి చేస్తేనే ఆసుపత్రిలో తాగునీటి కష్టాలు తీరతాయి.


ఆసుపత్రి ఆవరణలో ప్రమాదకరంగా పాత సంపు

ఆపన్న హస్తం

ఫిర్యాదులకు పోలీసుల తక్షణ స్పందన


రామగుండం కమిషనరేట్‌లో డయల్ 100 ఫిర్యాదులను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే, సిరిసిల్ల గ్రామీణం, జగిత్యాల, గోదావరిఖని

- గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన ఓ చిరుద్యోగి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. కొనుగోలు చేసిన ఇంటికి నెలవారీ కిస్తీలు కట్టలేకపోవడం, బ్యాంకు వాళ్లు నోటీసులు పంపిస్తుండటంతో ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబరు 20న గొడవ పెరగడంతో స్థానికులు 100 నంబరుకు ఫోన్ చేశారు. బ్లూకోల్ట్స్ పోలీసులు అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి వెళ్లారు. తరవాత చిరుద్యోగి భార్య ఇంటి తలుపులు మూసుకుని నిద్రమాత్రలు మింగడంతో కుటుంబ సభ్యులు మళ్లీ 100కు ఫోన్ చేశారు. పోలీసులు వెంటనే వచ్చి తలుపులు తెరిచి 108కి సమాచారం ఇచ్చి ఆమెను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడారు.
- **సెప్టెంబరు 10న** సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన 81 ఏళ్ల వృద్ధుడు అదృశ్యమయ్యారు. కుటుంబసభ్యులు 100కు ఫోన్ చేశారు. సిరిసిల్ల టౌన్ ఎస్సై శ్రీనివాస్ బృందాలుగా విడిపోయి ఆచూకీకి వెతకగా వంశీకృష్ణ కాలనీలో స్పృహ తప్పి పడిపోయినట్లు గుర్తించి 108కి సమాచారం అందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆపదకాలంలో ఆపన్న హస్తంగా పోలీసుల 'డయల్-100' బాధితులకు భరోసానిస్తోంది. ప్రతి జిల్లా ఎస్పీ కార్యాలయం, కమిషనరేట్ పరిధిలో డయల్ 100 పర్యవేక్షణకు ఒక కంట్రోల్ రూమ్ ఉంటుంది. ఇందులో ఒక సీఐ స్థాయి అధికారితోపాటు ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్, ఆరుగురు కానిస్టేబుల్స్ మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వహిస్తూ ఫోన్ కాల్స్‌ను పర్యవేక్షించడంతోపాటు బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేస్తారు.



ఎలా పని చేస్తుందంటే?

- ఆపదలో ఉన్నవారు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై డయల్ 100కు ఫోన్ చేస్తే వెంటనే కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది.
- సమాచారం అందుకున్న సిబ్బంది పట్టణ, నగర ప్రాంతాలైతే 10 నిమిషాల్లో.. మారుమూల గ్రామీణ ప్రాంతమైతే అరగంటలో చేరుకోవాలి.
- వెంటనే ట్యాబ్‌లో ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను నిక్షిప్తం చేసి ప్రాథమిక సమాచారం కంట్రోల్ రూమ్‌కు పంపిస్తూనే తగిన సహాయక చర్యలు చేపట్టాలి.



నిర్భయంగా చేయండి..

- **డయల్ 100కు ఉమ్మడి జిల్లాలో గత ఏడాది కాలంలో లక్షకు పైగా ఫిర్యాదులు వచ్చాయి.**
- ఆపదలు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై 100కు ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ చేస్తే సాక్ష్యం చెప్పాల్సి వస్తుందనే భయం అవసరం లేదు. డయల్ 100కు ఫోన్ చేస్తే సాక్ష్యం చెప్పాల్సిన పని లేదని అధికారులు చెబుతున్నారు.

ఒక్కో సమయంలో ఫిర్యాదులు ఇలా..

- **సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు :** రహదారులపై ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో బంగారు గొలుసుల చోరీ, ఆకతాయిల ఆగడాలు
- **రాత్రి 9 గంటల నుంచి :** మద్యం మత్తులో తాగుబోతుల ఆగడాలు, రహదారులపై వాగ్వాదాలు, గొడవలు, రౌడీ షీటర్ల అరాచకాలు.
- **రాత్రి 10 గంటల తరవాత :** భార్యాభర్తల మధ్య గొడవలు, గొడవలతో ఇంటి నుంచి బయటకు గెంటేసిన.. మద్యం సేవించి ఇంట్లో వారిపై, చుట్టుపక్కల వారిపై భౌతిక దాడులకు పాల్పడటం, హత్యాయత్నానికి పాల్పడుతామని బెదిరింపులు
- **అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు :** తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు, రహదారి ప్రమాదాలు, మద్యం గొలుసు (బెల్ట్) దుకాణాల నిర్వహణపై

మహిళల నుంచి వస్తున్న ఫిర్యాదులు : ఆకతాయిల వేధింపులు, ఫోన్‌లో అసభ్య చాటింగ్, ర్యాగింగ్, తాగుబోతుల అరాచకాలు, భర్తల వేధింపులు, ఆత్మహత్యాయత్నాలు, గృహహింస

పురుషుల నుంచి : రహదారి ప్రమాదాలు, వాగ్వాదాలు, పశువుల అక్రమ రవాణా, రేషన్ బియ్యం, గుట్కా దందా, మద్యం గొలుసు దుకాణాల విక్రయాలు

ఏడాది కాలంలో..

జిల్లా	వచ్చిన ఫిర్యాదులు	నమోదైన కేసులు
పెద్దపల్లి	55,969	571
రాజన్న సిరిసిల్ల	13,434	256
జగిత్యాల	26,613	293

ప్రాధాన్య క్రమంలో సమస్యల పరిష్కారం

- **వచ్చే బడ్జెట్‌లో 'పత్తిపాక'కు నిధులు**
- **ఏడాదిలోగా ఆర్టీసీ డిపోకు స్థలం: ఎమ్మెల్యే విజయరమణారావు**

ముఖాముఖి

న్యూస్‌టుడే, పెద్దపల్లి

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. గ్రామాల అనుసంధాన రహదారులు, మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాలకు బైపాస్ రోడ్ల నిర్మాణం, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్టీసీ డిపోల ఏర్పాటు, పత్తిపాక ప్రాజెక్టు నిర్మాణం, సుల్తానాబాద్‌లో ఐటీ పార్కు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలు, అభివృద్ధి అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు.

ప్రశ్న: పెద్దపల్లి, సుల్తానాబాద్ పురపాలికల్లో నిలిచిన పనులను ఎప్పుడు ప్రారంభిస్తారు?

జవాబు: పెద్దపల్లి పట్టణంలో రూ.30 కోట్ల టీయూఎఫ్ఐడీ(తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్) నిధులతో రహదారుల నిర్మాణం, తాగునీటి కోసం అమృత్ 2.౦ నిధులు రూ.25 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. సుల్తానాబాద్‌లో రూ.12 కోట్లతో రహదారులు, మురుగుకాలువల నిర్మాణం చేపడుతున్నాం.



ప్ర: ఎలిగేడు మండలం లాలపల్లి రహదారి అధ్వానంగా మారడంతో బస్సులు వెళ్లడం లేదు. ఈ రోడ్డు మరమ్మతుకు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?

జ: ఎలిగేడు నుంచి జూలపల్లి వైపు వెళ్లే ప్రతి బస్సూ లాలపల్లి మీదుగానే వెళ్లాలి. ఇటీవలి వర్షాలకు మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో బస్సులు నడిచే పరిస్థితి లేక ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్తున్నాయి. ఈ సమస్యను 'ఈనాడు' పత్రిక వెలుగులోకి తెచ్చింది. ఈ రహదారి నిర్మాణం కోసం సీఆర్‌ఆర్(కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్) నిధులు రూ.2 కోట్లతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. వారం, పది రోజుల్లో రహదారి నిర్మాణం ప్రారంభమవుతుంది.

ప్ర: నియోజకవర్గంలో ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేస్తున్నారా?

జ: పెద్దపల్లిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుపై గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రయత్నిస్తాం. కూనారం వరి పరిశోధనా స్థానం స్థాయి పెంచడం, ఈ కేంద్రానికి అనుసంధానంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కోసం ప్రయత్నిస్తాను. ఎలిగేడు మండలకేంద్రంలో జూనియర్ కళాశాల, పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తా.

ప్ర: ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు సాగునీటి కష్టాలు ఎప్పుడు తొలగుతాయి?

జ: నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా సాగునీటి సమస్యకు పత్తిపాక జలాశయ నిర్మాణమే పరిష్కార మార్గం. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధారంగా దీన్ని నిర్మించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ముందుకెళ్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులతో కార్యాచరణ మొదలవుతుంది.

ప్ర: జిల్లాకేంద్రంగా ఆవిర్భవించాక పెద్దపల్లిలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు స్థల కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: జిల్లా కోర్టును సబ్‌కోర్టులోని చాలీచాలని భవనంలో నిర్వహిస్తున్నారు. కోర్టు సముదాయానికి రాఘవాపూర్ సమీపంలో స్థలం కేటాయించాం. రవాణా, రిజిస్ట్రేషన్ల శాఖలకు కూడా త్వరలోనే గుర్తిస్తాం. అద్దె భవనంలోని అన్ని కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చే యత్నాలు జరుగుతున్నాయి.

ప్ర: ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు ఎప్పటిలోగా సాకారమవుతుంది?

జ: ఆర్టీసీ డిపో ఏర్పాటు లక్ష్యంగా గత ఎన్నికల్లో ప్రజల ముందుకొచ్చా. ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ప్రస్తుత మండల పరిషత్తు, పంచాయతీరాజ్ కార్యాలయాలతో పాటు డీసీఎంఎస్ గోదాములను తొలగించి, డిపోకు కేటాయించేందుకు యత్నిస్తున్నాం. ఏడాదిలోగా ఈ పనులన్నీ పూర్తి చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

ఆదివారంపేటలో ఎన్‌ఎల్‌ఎం సభ్యుల పర్యటన

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: రామగిరి మండలం ఆదివారంపేట పంచాయతీని నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం(ఎన్‌ఎల్‌ఎం) సభ్యులు బాలమురళి, సునీల్‌లు శుక్రవారం సందర్శించారు. పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులు, స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యుల కార్యక్రమాలు(ఎస్‌హెచ్‌జీ గ్రూపు), పింఛను పొందే విధానం తదితర అంశాలను గ్రామస్థులను అడిగి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. ఏపీడీ సత్యనారాయణ ఎంపీడీవో శైలజరాణి, విజిలెన్స్ అధికారి కొమురయ్య, ఎస్‌బీఎం రాఘవులు, ఈసీ లక్ష్మణ్, ఏపీఎం స్వరూప, టీఏలు సుప్రియ, అఖిల, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.


పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ఆహార శుద్ధికి అడుగులు

- మూడేళ్లకు తొలి యూనిట్ పూర్తి
- అనుమతుల ధ్రువీకరణకు సన్నాహక ఉత్పత్తి

ఈనాడు, సిరిసిల్ల

వస్త్రోత్పత్తులు.. దుస్తుల తయారీయే కాదు జిల్లాలో వీటి సరసన ఆహారశుద్ధి పరిశ్రమలూ చేరుతున్నాయి. మూడేళ్ల క్రితం నర్మాలలో ఆహారశుద్ధి హబ్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ప్రస్తుతం అందులోని తొలి యూనిట్‌లో ట్రయల్ రన్ జరుగుతోంది. మరిన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకొచ్చేలా కంపెనీ యాజమాన్యం ప్రణాళికలు చేస్తుంది. ఇది పూర్తిస్థాయి ఫలితాలను ఇవ్వడం ప్రారంభిస్తే జిల్లాలో పంట ఉత్పత్తులకు విలువలు జోడిస్తూ రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుంది. సాగులోనూ అనూహ్య మార్పులు వస్తాయి. నైపుణ్యం ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.





అంతర్గత రహదారుల నిర్మాణ పనులు



నర్మాలలో నిర్మాణం పూర్తయిన ఆహారశుద్ధి పరిశ్రమ

రూ.10 కోట్ల పెట్టుబడి

జిల్లా సరిహద్దులోని గంభీరావుపేట మండలం నర్మాలలో ఆహారశుద్ధి పరిశ్రమలకు 2017-18లో 350 ఎకరాల భూమిని సేకరించారు. అందులో 2021లో దుబాయ్‌కు చెందిన అగస్త్యా ఆహారశుద్ధి పరిశ్రమ ముందుకొచ్చింది. 3.5 ఎకరాల్లో రూ.10 కోట్ల పెట్టుబడితో మూడేళ్లకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉత్పత్తుల దిశగా అడుగులు పడుతున్నాయి. పరిశ్రమల పరమైన అన్ని రకాల తనిఖీలు, ఆయా శాఖల నుంచి ధ్రువీకరణల ప్రక్రియలు ముగిశాకే పూర్తిస్థాయి ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తాయి.

■ ఒక షిఫ్టులో 8 టన్నుల ధాన్యం ప్రాసెసింగ్ చేసే సామర్థ్యం ఉంది. దీనిలో రాగులు, జొన్న, సజ్జలతో ఆహార ఉత్పత్తులు తయారవుతాయి. మార్కెట్‌లోకి వీటి ఉత్పత్తులు ప్రారంభమయ్యాక, ఇదే కంపెనీకి చెందిన మరో రెండు పరిశ్రమల నిర్మాణం ఈ హబ్‌లో ప్రారంభించనున్నారు.

చిరుధాన్యాలకు డిమాండ్

ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి 11 లక్షల ఎకరాలు సాగైంది. వీటిలో 3.37 శాతం మాత్రమే చిరు ధాన్యాలు ఉన్నాయి. 2020లో ఇవి 7.15 శాతం ఉండేవి. జలాశయాల నిర్మాణంతో సాగునీటి లభ్యత పెరిగింది. దీంతో రైతులు వరి, పత్తి పంటలకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. దీనికితోడు పక్కనే ఉన్న ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోనూ చిరుధాన్యాల సాగు అంతంత మాత్రంగానే ఉంది. దీంతో పక్క రాష్ట్రాల్లోనూ కంపెనీ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఉత్పత్తులు సేకరించేలా రైతుల వద్దకు వెళ్తున్నారు.



■ జిల్లాలోనూ వ్యవసాయశాఖ, ఇతర అనుబంధ రంగాలతో కలిసి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించి వారితో కలిసి సాగు చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ కంపెనీకి తెలంగాణ, కర్ణాటకలో మూడు చోట్ల పరిశ్రమలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ప్రజల్లోనూ చిరుధాన్యాల వినియోగం పెరుగుతోంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తమ ఉత్పత్తులను పూర్తిగా సేంద్రియ విధానంలోకి తీసుకెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నారు.

■ టీజీఐఐసీ, ఎంఎస్ఎంఈలో భాగంగా ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. అక్షయ అగ్రిటెక్ అనే సంస్థకు వ్యవసాయ ఉపకరణాల తయారీ పరిశ్రమ కోసం ఇందులో స్థలం కేటాయించారు. మరో రెండు సంస్థలు ప్రభుత్వం వద్ద ఎంవోయూ దశలో ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనపై టీజీఐఐసీ జిల్లా మేనేజర్ బహుగుణను 'ఈనాడు' సంప్రదించింది. రూ.13 కోట్లతో జరుగుతున్న పనుల్లో వేగం పెంచినట్లు తెలిపారు. ప్రస్తుతం అంతర్గత రహదారుల పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్తు, తాగునీటి వసతులు కల్పిస్తున్నామన్నారు.

ధాన్యం ఆరబెట్టే యంత్రం

యువ రైతు ఆలోచనలకు రూపం

న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం



ధాన్యం ఆరబెట్టే యంత్రం



కిషన్ కుమార్

ఏటా అకాల వర్షాలతో ధాన్యం తడవడం.. తేమ శాతం ఎక్కువగా ఉందని కొనుగోలు చేయకపోవడం.. మొలకలు రావడంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతోంది.. తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు తగినంత వసతి లేక ఇబ్బందులు పడే దుస్థితి.. ఎలాగైనా ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని తయారు చేయాలని మూడు యంత్రాలు తయారు చేసి విఫలమయ్యాడు. పట్టు వదలని విక్రమార్కుడిలా గతంలోని లోపాలను సరిదిద్దుకుంటూ దాదాపు తొమ్మిదేళ్లపాటు శ్రమించి ధాన్యం ఆరబెట్టే యంత్రాన్ని తయారుచేశాడు జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికెపల్లికి చెందిన యువ రైతు గొనె కిషన్‌కుమార్. ఈ యంత్రం ద్వారా అన్నదాతకు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వీలుకలుగుతుందని పేర్కొన్నాడు. ఇప్పటివరకు ధాన్యం ఆరబెట్టేందుకు భారీ యంత్రాలు ఉండగా రైతులకు అందుబాటులో తక్కువ ధరలో యంత్రాన్ని తయారు చేసినట్లు కిషన్‌కుమార్ వివరించాడు.

యంత్రం పనితీరు ఇలా..

హీటర్లు, భారీ ఫ్యాన్లు, కన్వేయర్ బెల్టు, వీఎఫ్‌డీ, టెంపరేచర్ కంట్రోలర్, 3 త్రీఫేజ్ మోటార్లతో యంత్రాన్ని తయారు చేశాడు. ధాన్యాన్ని యంత్రంలో పోసిన తర్వాత 200 డిగ్రీల వేడితో ఫ్యాన్ల ద్వారా తేమ శాతం 15 నుంచి 17 శాతానికి చేరుకుంటుంది. గంటకు 100 బస్తాల వరకు తడిసిన ధాన్యం, మక్కలు ఆరబెట్టవచ్చని వివరించారు. యంత్రంలో ఆరబెట్టిన ధాన్యం నాణ్యతపై జెర్మినేషన్ సమస్య కూడా లేదని తానే స్వయంగా నారు పోసి పరీక్షించినట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2019లో పరిశ్రమలపై శిక్షణ పొందిన కిషన్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్‌కేవీవై రఫ్తార్ ఏబీఐ పథకంలో రెండేళ్ల కిందట రూ.4.50 లక్షలు తిరుపతి యూనివర్శిటీ నుంచి అందజేశారు. యంత్రం తయారీకి రూ.16 లక్షలు ఖర్చయినట్లు, ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తే మరిన్ని యంత్రాలు తయారు చేస్తానని వివరించారు.

పొగబట్టిన విధి

- విద్యుదాఘాతంతో ఇంట్లో మంటలు
- ఊపిరాడక ఏడేళ్ల బాలుడి మృత్యువాత



సాయికుమార్

మానకొండూర్, న్యూస్‌టుడే : యూకేజీ చదువుతున్న ఆ బాలుడు దసరా సెలవులు కావడంతో ఇంట్లో హాయిగా నిద్రిస్తున్నాడు.. తల్లి పని మీద కుమార్తెను తీసుకుని బయటకు వెళ్లింది.. కలత లేని నిద్రపోతున్న ఆ బాలుడిని అగ్ని ప్రమాదం బలి తీసుకుంది.. చుట్టూ మంటలు చెలరేగగా.. బయటకు వచ్చేందుకు ఆ బాలుడు ప్రయత్నించినా లాభం లేకపోయింది.. కమ్ముకున్న పొగ ఆ చిన్నారిని బలి తీసుకుంది.. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలో చోటు చేసుకున్న ఈ ఘటన కుటుంబసభ్యులను తీవ్ర ఆవేదనలో ముంచగా గ్రామస్థులను కలిచి వేసింది. పోలీసుల కథనం ప్రకారం.. అగ్గిడి అనిత, రాజు దంపతులకు కూతురు, కుమారుడు సాయికుమార్ (7) సంతానం కాగా కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పరదాలు కూడా అద్దెకు ఇస్తారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో సాయికుమార్ ఇంట్లో పడుకుని ఉండగా తల్లి అనిత కుమార్తెను తీసుకుని బయటకు వెళ్లింది. ఇంటికి విద్యుత్తు సరఫరా అయ్యే తీగ వదులుగా ఉండటంతో గాలికి ఊగి నిప్పు రవ్వలు చెలరేగాయి. అవి ఇంటి ముందు ఉన్న పరదాలపై పడటంతో మంటలు అంటుకున్నాయి. అవి ఇంట్లోకి వ్యాపించగా ఇంట్లో ఉన్న పరదాలకు కూడా నిప్పు అంటుకుంది. నిద్ర మేల్కొన్న సాయికుమార్ బయటకు రావడానికి ప్రయత్నించినా మంటలు ఎగిసి పడుతుండటంతో వీలుకాలేదు. భయంతో మరో గదిలోకి వెళ్లాడు. అయినా పొగ ధాటికి ఊపిరి ఆడలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చి బాలుడిని బయటకు తీసుకు రాగా అప్పటికే విగత జీవుడయ్యాడు. ఇంటికి కొద్ది దూరంలోనే ఉన్న తల్లి కుమారుడిని కాపాడుకుందామని పరిగెత్తుకు వచ్చినా లోపలికి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అయ్యో బిడ్డా అంటూ గుండెలు పగిలేలా రోదించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పల్లెల్లో మహిళా ఓటర్లే అధికం

జగిత్యాలలో ఎక్కువ.. పెద్దపల్లిలో తక్కువ

జిల్లాల వారీగా



ఉమ్మడి జిల్లాలో ఓటర్ల వివరాలు...

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు
జగిత్యాల	20	380	3500	2,83,010	3,10,522	8
కరీంనగర్	15	323	3022	2,57,333	2,69,894	10
పెద్దపల్లి	14	263	2436	2,01,006	2,06,697	13
సిరిసిల్ల	12	254	2230	1,67,686	1,78,553	20

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

ఈసారి జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో మహిళా ఓటర్లు సత్తా చాటే అవకాశముంది. గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రకటించిన తుది జాబితాలో వారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషులకంటే అధికంగా ఉండటమే అందుకు కారణం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ మహిళలకు ప్రకటించిన సంగతి తెలిసిందే. దానికి అనుగుణంగా అతివల ఓటర్లు పెరగడం వారి పాత్ర అన్ని రంగాల్లో కనిపిస్తోంది.

18 లక్షలకు పైగా..

గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించి తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 18,74,752 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 9,09,035 మంది పురుషులు, 9,65,666 మంది మహిళలు, 51 మంది ఇతరులు ఉన్నట్లు తేల్చారు. గత శాసనసభ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్లను వేరు చేసి సెప్టెంబరు 13న జాబితా ప్రకటించారు. గత నెల 14 నుంచి 21 వరకు పంచాయతీల్లో అభ్యంతరాలు స్వీకరించి 28న తుది జాబితా ప్రచురించారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో జగిత్యాల జిల్లాలో పురుషులు, మహిళలు కలిపి అత్యధికంగా 5,93,540 మంది ఓటర్లు ఉండగా, రాజన్న సిరిసిల్లలో తక్కువగా 3,46,259 మంది ఉన్నారు. మిగిలిన కరీంనగర్ జిల్లాలో 5,27,237, పెద్దపల్లిలో 4,07,716 ఓటర్లు ఉన్నారు.

అనంతరం ఎన్నికల సంఘం పరిశీలించి ఖరారు చేసింది. ఈ ఓటర్ల వివరాల ప్రకారం పంచాయతీ వార్డుల్లోని ఓటర్లతో ఎన్నికల ప్రక్రియ చేపడతారు.

56,631 మంది ఎక్కువ మగువలు..

ఎన్నికల సంఘం ప్రకటించిన పంచాయతీ ఓటర్ల వివరాలను పరిశీలిస్తే మొత్తం 18 లక్షలకు పైగా ఓటర్లలో నారీమణులదే పై చేయిగా ఉంది. పురుషులకంటే 56,631 మంది అధికంగా ఉన్నారు. వీరిలో కూడా జగిత్యాల జిల్లాలో అత్యధికంగా 27,512, పెద్దపల్లిలో 5091 మంది స్వల్పంగా ఉండగా కరీంనగర్‌లో 12,651 మంది, పెద్దపల్లిలో 10867 మంది మహిళలతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. 51 మంది ఇతరులు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

పంచాయతీల్లో సందడి..



ఎన్నికల సంఘం తుది జాబితా ప్రకటించిన తరువాత ఆయా జిల్లాలో పంచాయతీ, వార్డుల వారీగా పరిశీలిస్తూ రిజర్వేషన్లు ఇతర అంశాలపై ఆశావాహులు అంచనా వేసుకుంటున్నారు. గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొనే అవకాశముంది.

నేటి తరానికి మార్గదర్శకుడు రత్నాకర్‌రావు

మాజీ మంత్రి జువ్వాడి విగ్రహావిష్కరణలో మంత్రి శ్రీధర్‌బాబు

కోరుట్ల, న్యూస్‌టుడే: నేటితరం నాయకులు, ప్రజాప్రతినిధులకు మార్గదర్శకుడు దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం కోరుట్ల పట్టణ శివారులోని పశువైద్య కళాశాల ముందు ఏర్పాటు చేసిన రత్నాకర్‌రావు కాంస్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రత్నాకర్‌రావు గ్రామ సర్పంచిగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి రాష్ట్ర మంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. యువ నేతలను వెన్నంటి ప్రోత్సహించారని, అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నానంటే వారి అడుగు జాడల్లో నడవడంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో దేవాదాయశాఖమంత్రిగా దూప, దీప నైవేద్య పథకం ప్రవేశపెట్టి ఎన్నో దేవాలయాలకు పునరుజ్జీవం పోశారన్నారు. ఈ ప్రాంత రైతులకు ఉపయోగపడేలా పశువైద్య కళాశాలను కోరుట్లకు తీసుకువచ్చారని, ఇక్కడ చదివిన వందలాది మంది విద్యార్థులు పైశువైద్యులుగా రైతులకు సేవ చేయడంతోపాటు ఉపాధి పొందుతున్నారన్నారు. ధర్మపురి ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. కోరుట్ల ప్రాంతంలో తాగునీరు, సాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రత్నాకర్‌రావుతో కలిసి 4 దశాబ్దాలుపాటు ప్రజలకు సేవ చేశామన్నారు. ఎప్పుడు గ్రామీణ ప్రాంతంలో సౌకర్యాలు కల్పించేందుకు, రైతులకు సేవచేసేందుకు పరితపించేవారన్నారు. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, రత్నాకర్‌రావు కుమారులు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు, శేఖర్‌రావు మంత్రి శీధర్‌బాబును సన్మానించి జ్ఞాపికను అందజేశారు. జగిత్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు డా.సంజయ్, గడ్డం వినోద్, పెద్దపల్లి, భువనగిరి ఎంపీలు గడ్డం వంశీకృష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ఆరెపల్లి మోహన్, కోరుట్ల, జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లు, తదితరులు పాల్గొన్నారు.



కోరుట్లలో రత్నాకర్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో విప్ లక్ష్మణ్‌కుమార్, జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే వినోద్, ఆది శ్రీనివాస్

తుది పోరుకు కరీంనగర్ క్రికెట్ జట్టు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఉమ్మడి జట్టు ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం కరీంనగర్, నల్గొండ జిల్లా జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 299 పరుగులు సాధించింది. వాకౌట్ పద్ధతిలో గెలుపొందింది. కరీంనగర్ జిల్లా జట్టులోని తక్షిల్ 138, అక్ద్దాం 79, రిత్విక్ 20, క్రమాన్ 17 పరుగులు సాధించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా తక్షిల్ ఎంపికైనట్లు జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు తెలిపారు. క్రీడాకారులను ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌గౌడ్, సి.హెచ్ అజిత్‌కుమార్‌లు నగదు బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించి అభినందించారు.



జట్టుతో అసోసియేషన్ ప్రతినిధులు

కుస్తీ పోటీలు ప్రారంభం

ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా ధన్వాడలో శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల రెజ్లింగ్ (కుస్తీ) పోటీలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం మినహా తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి పోటీలు ప్రారంభించగా, క్రీడాకారులు వందన సమర్పణ చేశారు. వర్షం పడటంతో పోటీల నిర్వహణకు అంతరాయం ఏర్పడింది.



కరీంనగర్ కుస్తీ క్రీడాకారుల వందన సమర్పణ

హ్యాండ్‌బాల్‌లో సెమీ ఫైనల్‌కు కరీంనగర్

కోస్గి న్యూటౌన్ : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగాయి. బాలికల విభాగంలో కరీంనగర్, ఆదిలాబాద్ జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు ఫైనల్‌కు చేరగా, రెండో సెమీఫైనల్ మ్యాచ్ కరీంనగర్ - హైదరాబాద్ మధ్య శనివారం ఉదయం నిర్వహించనున్నారు.

బడి పిల్లలకు మళ్లీ రాగిజావ

పండుగ సెలవుల తర్వాత ప్రారంభం



పెద్దపల్లిలో రాగి జావ గ్లాసులు చూపుతున్న విద్యార్థినులు (పాతచిత్రం)

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ఉదయం ఏమీ తినకుండానే పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. మూడు నెలలుగా నిలిచిపోయిన రాగిజావ పంపిణీ పునఃప్రారంభం కానుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దసరా సెలవుల తర్వాత ఉదయం వేళలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేయనున్నారు. పీఎం పోషణ్ పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 1 నుంచి 10వ తరగతి పిల్లలకు రాగి జావ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఉదయం చాలా మంది పిల్లలు ఏమీ తినకుండానే బడికి వచ్చి మధ్యాహ్నం వరకు పస్తులుండాల్సి వస్తోంది.

వారంలో మూడు రోజులు

ప్రతి విద్యార్థికి పది గ్రాముల రాగి పౌడర్, బెల్లంతో కలిపి మరగబెట్టిన జావను వారంలో మూడు రోజుల పాటు అందిస్తున్నారు. నిర్వహణ బాధ్యతను మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు అప్పగించారు. రాగిజావ తయారీ కోసం ఉదయాన్నే పాఠశాలకు వెళ్తున్నా శ్రమకు తగిన ప్రతిఫలం ఉండటం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పలు చోట్ల నామమాత్రంగా పంపిణీ చేశారనే ఆరోపణలున్నాయి. గతంలో ఎదురైన అడ్డంకులు అధిగమిస్తేనే పోషక మిళితమైన జావ పిల్లలకు అందనుంది. పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలో 1,28,571 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

గతేడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో పోషకాహార లోపం నివారించేందుకు, ఉదయం విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మూడేళ్ల కిందట ఎంపిక చేసిన జిల్లాల్లో సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు పూర్తి సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం అమలు చేశారు. సత్ఫలితాలు రావడంతో గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వం, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేశారు. ఈ ఏడాది జూన్‌లో 6 రోజులు, జులైలో 11 రోజులకే సామగ్రి రావడంతో అక్కడి వరకే పంపిణీ చేశారు. ప్రభుత్వంతో సంస్థ ఒప్పందం కుదుర్చుకోవడంలో జాప్యం జరగడంతో మూడు నెలలుగా పథకం నిలిచిపోయింది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని ఓ పాఠశాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి.వెంకటస్వామిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. తొమ్మిదో తరగతి చదివే బాలికను వేధించాడన్న ఫిర్యాదుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పట్టణ సీఐ సూరం వేణుగోపాల్ తెలిపారు. అశ్లీల చిత్రాలను చూపిస్తూ వేధించాడని బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఎస్సై శ్వేత సస్పెన్షన్



జగిత్యాల, న్యూస్‌టుడే: కోరుట్ల ఎస్సైగా పనిచేసిన శ్వేత సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల జగిత్యాలకు చెందిన బొల్లారపు శివప్రసాద్‌ను ఠాణాకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించగా అవమాన భారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆమెను జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పూర్తిస్థాయి నివేదిక సమర్పించిన నేపథ్యంలో మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఎస్సై శ్వేతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి, న్యూస్‌టుడే: రాజరాజేశ్వర (మధ్య మానేరు) జలాశయం నుంచి ఎల్ఎండీకి శుక్రవారం నీటిని విడుదల చేశారు. జలాశయం రెండు గేట్ల నుంచి 4,761 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 27.14 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

తేమతో తగ్గిన కొత్త పత్తి ధర

జమ్మికుంట, న్యూస్‌టుడే : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం అధిక తేమతో కొత్త పత్తి ధర తగ్గింది. యార్డుకు 38 ట్రాలీల కొత్త పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో కొత్త విడి పత్తి క్వింటా కనిష్ఠ ధర రూ.6,000.. గరిష్ఠ ధర రూ.6,750 పలికింది. గురువారం గరిష్ఠ ధర రూ.6900లు నమోదు కాగా రోజు వ్యవధిలోనే రూ.150 తగ్గింది. 58 క్వింటాళ్ల బస్తాల పత్తి విక్రయానికి రాగా రూ.5,500 నుంచి రూ.6,700 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. ఏడు ట్రాలీల పాత విడిపత్తి విక్రయానికి రాగా రూ.7,200 నుంచి రూ.7,400 వరకు వెచ్చించి వ్యాపారులు ధరను నిర్ణయించారు. రైతులు కొత్తపత్తిని ఏరగానే నేరుగా యార్డుకు విక్రయానికి తీసుకు వస్తున్నారని తేమతో ధర తగ్గుతోందని మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం తెలిపారు. రానున్న సీజన్ కోసం స్థానిక జిన్నింగ్ మిల్లుల్లో యంత్రాల పరిశీలన, మరమ్మతు పనులు చేపట్టడంతో దీపావళి తర్వాతే మిల్లుల వ్యాపారులు కొనుగోళ్లు చేపట్టనున్నారు. ప్రస్తుతం కొత్త పత్తిని చిన్న వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

రాజన్న గోశాలలో మూడు కోడెల మృతి

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో శుక్రవారం మూడు కోడెలు అస్వస్థతకు గురై మృతి చెందాయి. మృతి చెందిన వాటిని మూలవాగులో గోశాల సిబ్బంది పూడ్చి వేశారు. జెర్సీ బ్రీడ్‌కు సంబంధించినవి కావడంతో ప్రస్తుతం ఎండల వేడికి తట్టుకోలేక రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాయని, వైద్యం అందించినప్పటికీ కోలులేక మృతి చెందినట్లు గోశాల పశువైద్య సహాయకుడు సాయి తెలిపారు.

16 నుంచి బీఫార్మసీ పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే బీఫార్మసీ ఆరో, అయిదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 16, 17 తేదీల నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ అయిదో సెమిస్టర్ పరీక్షలు 17 నుంచి జరగనున్నట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, కాల్వశ్రీరాంపూర్

? కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కోతుల సమస్య అధికంగా ఉంది. ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. **-రమేశ్, కాల్వశ్రీరాంపూర్**

✔ కోతుల బెడదపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. **-ఎంపీడీవో రామ్మోహన్‌చారి**

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

? గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిమొక్కలు పెరగడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. **- సంపత్, కళ్యాణ్‌నగర్.**

✔ వెంటనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **- యూసూఫ్, రామగుండం నగరపాలక పారిశుద్ధ్య సహాయ పర్యవేక్షకుడు**

అయిదేళ్లయినా శివారు దశ మారలే!

సుల్తానాబాద్ కాలనీల్లో కనీస వసతులు కరవు



పూసాలలోని శ్మశానవాటిక దుస్థితి ఇది. దహనవాటికల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఇక్కడికి దారి సరిగ్గా లేకపోవడమే కాక మృతుల సంబంధీకులకు నీటి వసతి లేదు. అంత్యక్రియల అనంతరం సమీపంలోని పొలాల వద్ద స్నానాలు చేయాల్సి వస్తోంది. శ్మశానవాటికకు ప్రత్యేక నిధులు కేటాయించి వైకుంఠధామంగా అభివృద్ధి చేయాలని, వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ నుంచి పురపాలక సంఘంగా ఉన్నతీకరించి అయిదేళ్లవుతున్నా సుల్తానాబాద్ పట్టణంలోని శివారు కాలనీలను సమస్యలు వదలడం లేదు. మున్సిపాలిటీగా మారాక పన్నుల భారం తప్ప వసతులు మెరుగుపడలేదని ప్రజలు వాపోతున్నారు. శివారు కాలనీల సమస్యలపై పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పన్ను వసూళ్లతో వచ్చే ఆదాయం, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సిబ్బంది వేతనాలకు, పారిశుద్ధ్య పనులకే సరిపోవడం లేదన్నారు. ప్రత్యేక నిధుల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదించారని, మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

-న్యూస్‌టుడే, సుల్తానాబాద్



మార్కండేయకాలనీలో సీసీ రహదారులు, మురుగుకాలువల నిర్మాణం లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో రహదారులు బురదమయమవడం, కాలువలు లేక ఇళ్ల పక్కనే మురుగు నిలిచి ఉండటంతో పందులు, దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. పందుల సంచారంతో పాటు చెత్త పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.

శాస్త్రీనగర్‌లోని ఎస్సారెస్పీ డీ86 ఉపకాలువలో చెత్తా చెదారం పేరుకుపోయి పాములకు, దోమలకు ఆవాసంగా మారింది. వర్షాకాలంలో స్థానికంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ కాలువ పక్క నుంచి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉన్నందున కాలువను శుభ్రం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, చిత్రంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ తదితరులు

ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై శ్రద్ధ వహించాలి

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ అన్నారు. రామగుండం నగరపాలక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం ఎరువుల కర్మాగారం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే శబ్ద, వాయు, జల కాలుష్యంతో ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పరిశ్రమలు సామాజిక బాధ్యతగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వేలాడుతున్న విద్యుత్తు తీగలను, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలన్నారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించాలని, ఎల్ఈడీ లైట్లతో నగర సుందరీకరణ పనులు చేపట్టాలని సింగరేణి అధికారులను కోరారు. రాముని గుండాలు, జనగామ శివాలయం, ఎల్లపల్లి, సుందిళ్ల రిజర్వాయర్లు, ఉపరితల, భూగర్భ బొగ్గుగనుల, గోదావరినది తదితర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. నగరపాలక వాణిజ్య భవన సముదాయాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ, రామగుండం ఎరువుల కర్మాగారం, సింగరేణి ఆర్జీ-1 జనరల్ మేనేజర్లు ప్రదీప్‌వర్మ, లలిత్‌కుమార్, నగరపాలక ఎస్ఈ శివానంద్, కార్యదర్శి రాజుతో పాటు పలువురు కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య



కుమార్‌రెడ్డి

ఓదెల, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఓదెల మండలం గుండ్లపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పొత్కపల్లి పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రైతు పెద్దిరెడ్డి కుమార్‌రెడ్డి(48) ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై ఈ నెల 2న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై జి.అశోక్‌రెడ్డి తెలిపారు.

యువతి బలవన్మరణం

జ్యోతినగర్(మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే: ఎన్టీపీసీ పరిధిలోని ప్రగతినగర్‌కు చెందిన రమ్య(22) ఆత్మహత్యకు పాల్పడింది. ఎన్టీపీసీ పోలీసుల కథనం ప్రకారం.. ఎంబీఏ చదువుతున్న రమ్య శుక్రవారం ఇంట్లో ఎవరి లేని సమయంలో ఉరేసుకుంది. ఇంట్లో ఆర్థిక పరిస్థితుల కారణంగా రమ్య ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. రమ్య తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

ఖనిలో విద్యార్థి..



నితిన్

గోదావరిఖని: గోదావరిఖనిలోని లెనిన్‌నగర్‌కు చెందిన విద్యార్థి తాండ్ర నితిన్(23) శుక్రవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో డిప్లొమా చదువుతున్న నితిన్ రెండు నెలల క్రితం గోదావరిఖనికి వచ్చాడు. ఇక్కడే ఉంటూ కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నాడు. తాగుడుకు బానిసైన నితిన్ తరచూ తండ్రిని డబ్బులు అడగగా నిరాకరించేవాడు. ఈ విషయంలో పలు మార్లు గొడవలు కావడంతో నితిన్ ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉండేవాడు. శుక్రవారం ఉదయం నితిన్ తల్లి అంగన్‌వాడీ కేంద్రానికి.. తండ్రి ఆటో నడపడానికి వెళ్లారు. ఈ క్రమంలో నితిన్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న తల్లి కొడుకు గది తెరుచుకోకపోవడంతో తండ్రికి సమాచారం ఇచ్చింది. వెంటనే ఇంటికి చేరుకున్న తండ్రి తలుపును బలంగా నెట్టి లోపలికి వెళ్లి చూసే సరికి ఉరేసుకొని ఉన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేర వార్తలు

చికిత్స పొందుతూ మహిళ మృతి



మౌనిక

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై శ్రావణ్ కుమార్, మృతురాలి బంధువుల కథనం ప్రకారం సుల్తానాబాద్ మండలం దేవునిపల్లికి చెందిన బండి లక్ష్మి, మల్లయ్య దంపతుల కూతురు మౌనిక(30)ను మానకొండూరుకు చెందిన శివరాత్రి రాజుకు ఇచ్చి 2012లో పెళ్లి చేశారు. వారికి పదేళ్ల కుమారుడున్నాడు. అయితే కొద్ది కాలం భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. అనంతరం జరిగిన ఒప్పందం మేరకు దంపతులు దేవునిపల్లిలో వచ్చి ఉంటున్నారు. రాజు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అనంతరం 'లావుగా ఉన్నావు, మరో పెళ్లి చేసుకుంటా' నంటూ రాజు భార్యను శారీరకంగా, మానసికంగా వేధించాడు. భరించలేక మౌనిక ఈ నెల 1న పురుగుల మందు తాగింది. వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు మంథని ఎస్సై రమేశ్ తెలిపారు. విలోచవరం పరిసరాల్లోని గోదావరి నది నుంచి మంథని పట్టణానికి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు గోదావరి తీరానికి వెళ్లారు. ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొని వస్తుండగా ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. విలోచవరం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మీసాల నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై..

పాలకుర్తి(రామగుండం), న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రామగుండం పోలీసులు శుక్రవారం తెలిపారు. రామగుండం ఎస్సై సుధాకర్ కథనం మేరకు.. మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ మండలం తాళ్లపల్లి ప్రాంతానికి చెందిన కందుగుల కుమార్ బెల్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. కుమార్‌కు ఒక కుమార్తె సంతానం కాగా.. రామగుండం హౌసింగ్‌బోర్డుకాలనీలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటుంది. గత నెల 20న కుమార్ భార్య విజయతో కలిసి కుమార్తెను చూడడానికి హౌసింగ్‌బోర్డు కాలనీకి వచ్చాడు. 26న ఇంటికి వెళ్తున్నానని చెప్పి కనిపించకుండా పోయాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో విజయ శుక్రవారం రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

గుండ్లపల్లెలో ఇరు వర్గాల ఘర్షణ

ఓదెల: ఓదెల మండలం గుండ్లపల్లెలో శుక్రవారం సాయంత్రం రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. అప్పు ఇచ్చిన విషయంలో మాటామాటా పెరిగి మద్యం మత్తులో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు మరో వర్గంపై దాడి చేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ఎస్సై జి.అశోక్ రెడ్డి గ్రామంలో గొడవలు పెరగకుండా పోలీసు సిబ్బందితో చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై తెలిపారు.

తీవ్ర జ్వరంతో పదో తరగతి విద్యార్థి మృతి



చిన్నా

పాలకుర్తి, న్యూస్‌టుడే: తీవ్ర జ్వరంతో చికిత్స పొందుతూ పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కంటె స్వామి-సౌందర్య దంపతులకు ఇద్దరు కుమారుల సంతానం. స్వామి సుమారు పది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. వీరి పెద్ద కుమారుడు చిన్నా(15) స్థానిక ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. గత పది రోజుల నుంచి తీవ్రమైన జ్వరంతో బాధ పడుతుండగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా ఇన్ఫెక్షన్‌తో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుమారుడిని తల్లి కాపాడుకోలేకపోయింది. చిన్నా మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



జేఎన్టీయూ మైదానంలో బతుకమ్మ ఆడుతున్న యువతులు



పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో..



మదర్‌థెరిస్సా కళాశాలలో..

కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు

కమాన్‌పూర్, పెద్దపల్లి, పెద్దపల్లి కలెక్టరేట్, సుల్తానాబాద్, న్యూస్‌టుడే: పన్నూరులోని మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి విద్యార్థినులు, అధ్యాపకులు క్రీడా మైదానంలో ఆడిపాడారు. పెద్దపల్లిలోని ట్రినిటీ, మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థినులు, అధ్యాపకులు సందడి చేశారు. పెద్దపల్లి గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపకులు నృత్యాలతో అలరించారు. సుల్తానాబాద్ శ్రీవాణి జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆడిపాడారు.



సుల్తానాబాద్ శ్రీవాణి కళాశాలలో..



గాయత్రి కళాశాలలో..

అమ్మవారి సన్నిధిలో మంత్రి పూజలు

మంథని, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మంథని పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు పూజలు చేశారు. నిరంతర భజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పక్కనే ఉన్న పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు.



ఆలయంలో నిరంతర భజనలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

వైస్‌ఛైర్మన్ కుటుంబానికి పరామర్శ

మంథని మున్సిపల్ వైస్ ఛైర్మన్ బానయ్య తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు.

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): రామయ్యపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఆరెల్లి కొమురయ్యగౌడ్ తండ్రి వెంకటి, లద్నాపూర్‌కు చెందిన నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ తండ్రి శంకరయ్య ఇటీవల ఇటీవల మృతి చెందారు. రెండు కుటుంబాలను మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం పరామర్శించారు. బుధవారంపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన మంత్రి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలని వినతి

ముత్తారం: మచ్చుపేటలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయానికి సాయం చేయాలంటూ సంఘం నాయకులు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీ, వాజిద్‌పాషా, మద్దెల రాజయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాకేంద్రాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉచిత విద్య, ఉద్యోగ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సుల్తానాబాద్‌లో ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను పంపిణీ చేశారు. జీవో నంబర్ 317తో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీర్చడానికి కృషి చేస్తానన్నారు. అంతకుముందు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక వాసవిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కర్, సభ్యులు మురళీధర్, సత్యనారాయణ, కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని: తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి వెల్లడించారు. గోదావరిఖనిలో పలు ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలతో పాటు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు.

పండుగల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: దసరా, బతుకమ్మ పర్వదినాల నిర్వహణకు గ్రామ స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు అధికారులను ఆదేశించారు. పండుగలకు ఏర్పాట్లపై శుక్రవారం పెద్దపల్లిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బతుకమ్మ వేడుకల కోసం లైటింగ్, సౌండ్ సిస్టమ్‌ను, ఆడే ప్రాంతాన్ని శుభ్రం చేసి, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జడ్పీ సీఈవో సురేందర్, డీపీవో వీరబుచ్చయ్య, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశమివ్వండి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం భాజపా ఆధ్వర్యంలో పెద్దపల్లి కోర్టు ఆవరణలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తాను బరిలో నిలువనున్నందున అవకాశమివ్వాలని న్యాయవాదులను అభ్యర్థించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, న్యాయవాదులు సి.సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, రమణారెడ్డి, హన్మాన్‌సింగ్, పుట్ట రవి, గణేష్, పల్లె సదానందం, రాంసింగ్, వెన్నంపల్లి శ్రీనివాస్‌రావు, పర్స సమ్మయ్య, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు డాక్టరేట్



రమేశ్

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: కమాన్‌పూర్ మండలం గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అర్థశాస్త్రం అధ్యాపకుడు జాలిగాం రమేశ్‌కు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎన్.విజయ పర్యవేక్షణలో 'తెలంగాణలోని పాక్షిక శుష్క మండలాల్లోని నీటి పారుదల యాంత్రీకరణ, వ్యవసాయ వృద్ధి' అంశంపై పరిశోధనకు కేయూ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు.



కనకయ్య

మార్కండేయకాలనీ: గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకుడు జీడీ కనకయ్య డాక్టరేట్ పొందనున్నట్లు తెలిపారు. 'ఉమెన్ పొలిటికల్ ఎగ్జిక్యూటివ్స్ ఇన్ పంచాయతీరాజ్-పర్సెప్షన్ అండ్ పర్ఫామెన్స్ ఇన్ వరంగల్ జిల్లా ఏ స్టడీ' అంశంపై డాక్టర్ సుజాత కుమారి పర్యవేక్షణలో పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని కాకతీయ విశ్వవిద్యాలయానికి సమర్పించినట్లు ఆయన పేర్కొన్నాడు. దీంతో విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించిందని చెప్పారు.

ప్రజా చైతన్యమే ఆయన లక్ష్యం



అర్జున్‌రావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, న్యూస్‌టుడే: ప్రజలను చైతన్య పర్చడంలో అర్జున్‌రావు నిరంతరం పని చేశారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గోదావరిఖనిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో విప్లవ నాయకుడు అర్జున్‌రావు సంస్మరణ సభ శుక్రవారం నిర్వహించారు. కొప్పుల ఈశ్వర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఐఎఫ్‌టీయూలో బాధ్యతలు నిర్వహించిన ఆయన కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. 1975 నుంచి 2002 వరకు ఆయన సింగరేణి కార్మికుల పక్షాన ఉండి పోరాటాలు చేశారన్నారు. వివిధ సంఘాల నాయకులు ఎ.ఎస్.పి.రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్, విఠల్‌రెడ్డి, భిక్షమయ్య, లక్ష్మయ్య, అరుణోదయ కళాకారులు రాజన్న, లింగయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో గనిని సందర్శించిన డీడీఎంఎస్



గోదావరిఖని, న్యూస్‌టుడే: ఎలక్ట్రికల్ డీడీఎంఎస్ అధికారి రాజీవ్ ఓంప్రకాశ్‌వర్మ జీడీకే-1 గనిని శుక్రవారం సందర్శించారు. గనిలోకి దిగిన ఆయన విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గని అధికారులు డీడీఎంఎస్ అధికారికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట ఏరియా ఇంజినీర్ వెంకటేశ్వర్‌రావు, ఏజెంట్ రమేశ్, డీజీఎం అశోక్‌కుమార్, మేనేజర్ రమేశ్, ఇతర అధికారులు శ్రీనివాస్, శేఖర్, శ్రీనివాసు పాల్గొన్నారు.

నీటిశుద్ధి ప్లాంట్ల ప్రారంభం

గోదావరిఖని, న్యూస్‌టుడే: కార్మికులకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంట్లను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ శుక్రవారం ప్రారంభించారు. జవహర్‌నగర్, విఠల్ నగర్ ప్రాంతాల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన 2 వేల లీటర్ల సామర్థ్యం గల ప్లాంట్ల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే తిలక్‌నగర్ కూడలిలో రహదారి విస్తరణ పనులను ప్రారంభించారు. నగర మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, అధికారులు ఏఐటీయూసీ నాయకుడు పోశం పాల్గొన్నారు.

లాభాల వాటాపై రేపు నిరసన దీక్ష

గోదావరిఖని, న్యూస్‌టుడే: లాభాల వాటాలో కార్మికులకు జరిగిన అన్యాయంపై ఆదివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. గోదావరిఖనిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లాభాలు పెరిగినప్పటికీ కార్మికులకు మాత్రం వాటా గత ఏడాది మాదిరిగానే ఇచ్చారన్నారు. తెలంగాణ సాధన కోసం పోరాటం చేసిన కార్మికులకు చేసిన న్యాయం ఇదేనా అని ప్రశ్నించారు. తెబొగకాసం అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖని, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్జీ-1 అధికార ప్రతినిధి కిరణ్‌బాబు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు శనివారం నుంచి ఈ నెల 8 వరకు జీవీటీసీలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 150 మందిని ఎంపిక చేసి శిక్షణకు పంపిస్తామన్నారు. డ్రైవాల్, ఫాల్ సీలింగ్, వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్, ఆటోమొబైల్, టూవీలర్, ఎక్స్‌కావేటర్ ఆపరేటర్, గెస్టు సర్వీస్ అసోసియేషన్, హోటల్ మేనేజ్‌మెంట్, ఆఫీస్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్, రిఫ్రిజిరేషన్, ఏయిర్ కండీషన్, ఎలక్ట్రికల్, హౌస్ వైరింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అభ్యర్థి వెంట తల్లిదండ్రుల్లో ఒకరిని అనుమతిస్తారని వివరించారు.

మంత్రికి ఘన స్వాగతం

ధర్మారం, న్యూస్‌టుడే: కోరుట్ల, నిజామాబాద్‌ల పర్యటనకు వెళ్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు శుక్రవారం ధర్మారంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ప్రధాన కూడలి వద్ద మంత్రి కాసేపు ఆగారు. ఏఎంసీ ఛైర్మన్ లావుడ్యా రూప్లానాయక్, మాజీ ఎంపీపీ కొడారి హనుమాన్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కొత్త నర్సింహం, పాలకుర్తి రాజేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన మున్నూరుకాపు నాయకులు


ధర్మారం: మున్నూరు కాపు సంఘం మండల నాయకులు శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ధర్మపురి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ప్రభుత్వ విప్ సన్మానించారు. మండలంలోని గ్రామ సంఘాల భవనాల వద్ద అసంపూర్తిగా ఉన్న పనుల పూర్తికి నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. సంఘం అధ్యక్షుడు గందం మల్లయ్య, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు రాజన్న, రాజేందర్, కోశాధికారి నార సురేందర్, గౌరవాధ్యక్షులు కొడారి హనుమాన్, నర్సింహం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

యునెస్కో విద్యా సదస్సుకు కొమెర వాసి



మల్లారెడ్డి

ఓదెల, న్యూస్‌టుడే: ఈ నెల 11, 12 తేదీల్లో ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్ అల్ఫ్రాగానస్ విశ్వవిద్యాలయంలో జరుగనున్న ఆసియా-పసిఫిక్ యునెస్కో వ్యవస్థాపక విద్యా సదస్సుకు ఓదెల మండలం కొమెరకు చెందిన డా.కొత్తిరెడ్డి మల్లారెడ్డికి ఆహ్వానం అందింది. మల్లారెడ్డి ప్రస్తుతం హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. యువత ఈ శతాబ్దపు సంక్లిష్ట సవాళ్లను అధిగమించి విజయవంతమైన భవిష్యత్తు పెంపొందించుకోవడానికి సమర్థవంతమైన వ్యవస్థాపక విద్య, వ్యూహాల రూపకల్పన, నూతన స్టార్టప్‌ల ఏర్పాటు వంటి అంశాలపై సదస్సులో ప్రసంగించనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు.



కమాన్‌పూర్‌లోని ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో..



ముత్తారం: ఖమ్మంపల్లిలో గాయత్రీమాతగా అమ్మవారు



మార్కండేయకాలనీలోని దుర్గాదేవి మండపంలో విశేష పూజల్లో మహిళలు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు జిల్లావ్యాప్తంగా మండపాల్లో పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల కుంకుమపూజలు, అన్నదానాలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే బృందం



సుల్తానాబాద్-జవహర్‌నగర్‌లో పూజలు చేస్తున్న మహిళలు